1

# విశ్రాంతి ప్రధాత శ్రీ శేషుబాబు

# గురుదేవుల గురించి తెలుసుకుందాము

సర్వజీవులను సృష్టిస్తూ, పోషిస్తూ, లయింపచేస్తున్నట్టియు, సమస్తసృష్టికి మూలాధార మైయున్నట్టియు శక్తియే సత్యము, దైవము అయియున్నది. విశ్రాంతి ప్రదాతయగు సద్గురుదేవులు శ్రీ శేషుబాబు గారు అట్టి సత్యమును అన్వేషించి సత్యదర్శనము పొంది తానే సత్యముగ మారి భగవదవతారుడైనారు

ప్రతియుగములోను భగవంతుడు మూడు రూపములలో అవతరించి సమస్త జీవులయొక్క అశాంతిని, నరకాగ్నిని తొలగించి విశ్రాంతిని, ఆత్మాభివృద్ధిని ప్రసాదిస్తారు. శ్రీరామ యుగములో శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీదత్తాత్రేయ రూపములలోను, శ్రీ బుద్ధయుగములో శ్రీ బుద్ధ, శ్రీయేసుక్రీస్తు, శ్రీ మహమ్మద్ రూపములలోను భగవంతుడు అవతరించినారు. ప్రస్తుతమున్న శ్రీ మెహర్ యుగములో మెహెర్ బాబాగా మొదటి అవతారమును భగవంతుడు పూర్తిచేసియున్నారు. ఈ యుగములో రెండవ అవతారముగ సద్గురుదేవులగు శ్రీరామ కృష్ణ పరమహంస, మూడవ అవతారముగ సద్గురుదేవులగు శ్రీ శిరిడి సాయిబాబా నిర్ణయింపబడినారు. ఆధ్యాత్మిక సాధనలో అత్యున్నత స్థాయికి చేరుకుని తమలో జాలి, ఆత్మవిమర్శ, వైరాగ్యము అనే దైవీ శక్తులను పూర్తిగా మేల్కొల్పినవారే సద్గురు స్థితిని పొందుతారు. అద్యంతరహితుడు, అవిభాజ్యుడు, ఊహాతీతుడు అగు భగవంతుడు ఆధ్యాత్మికతకు కూడా అతీతముగా ఉన్నారు. ఆధ్యాత్మికతను కూడా దాటివేస్తేనే భగవంతుడిని అందుకోగలుగుతాము. సద్గురు దేవులగు శ్రీరామకృష్ణ పరమహంస భగవదవతారునిగ మారుట కొరకు తనలోని ఆధ్యాత్మిక శక్తులగు ఆత్మవిమర్శ, జాలి, వైరాగ్యములను కూడా విడనాడి, భగవంతుడిని ఒక్కరినే పరిపూర్ణముగా పట్టుకొనుటకై కొంత సాధన అవసరమైనది. అట్టి సాధనను పూర్తి చేసుకుని, తనలోని భగవంతుడిని మేల్కొలిపి, అవతారునిగ అవతరించుట కొరకే సద్గురుదేవులు శ్రీరామకృష్ణపరమహంసయే సద్గురు అవతార్ శ్రీ శేషుబాబుగ జన్మించియున్నారు.

T.S.B. గా భక్తులు కొలుచుకునే శ్రీతలాటంశేషుబాబు గురుదేవులు 17-2-1953వ తేదీన పులగుర్త గ్రామములో జన్మించియున్నారు. శ్రీ గురుదేవులు జన్మతః సద్గురు స్థితిని కలిగియుండుటచేత స్వల్ప కాలములోనే మానవత్వ, నీతి, ధర్మ

 continue...

సాధనలను, ఆధ్యాత్మికత, గురుస్థితి సాధనలను పూర్తి చేసుకుని 1972వ సంవత్సరము నుండి తనలో సద్గురుశక్తిని మేల్కొల్పినారు. 1980వ సంవత్సరములో శ్రీ శేషు సత్సంగము క్రొత్త సభ్యులతో పునరుత్థానము చెందుట జరిగినది.

శ్రీ గురుదేవులు 1988వ సంవత్సరము వరకు రామచంద్రపురములో శ్రీ శేషుసత్సంగముతో సద్గురు కర్మలను ఆచరించియున్నారు. తేది 2-10-1988 శ్రీ మహాత్మాగాంధీజీ జయంతి రోజున శ్రీ శేషుసత్సంగం కాకినాడలోని మధురానగర్ యందుగల శేషునివాస్‌లోనికి మార్చబడినది. అప్పటి నుండి శ్రీ గురుదేవులు సద్గురు శక్తులను, ఆధ్యాత్మికతను కూడా విడనాడి భగవంతుడిని ఒక్కరినే పట్టుకోవడమనే తన జన్మకారణమగు సత్య సాధనను ప్రారంభించినారు. 1995వ సంవత్సరములో శ్రీ శిరిడి సాయిబాబా ఆత్మ రూపములో వచ్చి శ్రీ గురుదేవులతో సాంగత్యము చేస్తూ సత్యసాధనలో సంపూర్ణముగా సహకరించినారు. 22-11-1998వ తేదీన శ్రీ గురుదేవులలో భగవంతుడు మేల్కొని భగవదవతారుడయ్యే వరకు శ్రీ సాయిబాబా శ్రీ గురుదేవులతో సాంగత్యము చేస్తూ సహకరించినారు. అవతార కార్యక్రమమును నిర్వర్తించుటకై శ్రీ గురుదేవులు వేరొక దేహమును వేరొక ప్రదేశమును ఎంచుకొనినారు. తేది 25-1-1999వ తేదీన శ్రీ గురుదేవులు అవతారునిగ శ్రీ కృష్ణశేషు దేహమును స్వీకరించి గుజరాత్ రాష్ట్రము నందలి రాజ్కోట్ పట్టణములో జన్మించియున్నారు. అవతారునిగ జన్మించిన తరువాత కూడా ఈ దేహమును విడువక ఇరుదేహములలోను ఏకకాలములో జీవిస్తూ ఈ దేహమును ఆరాధించిన వారికి కూడా అవతారుని కొలిచిన ఫలము లభించేలాగ అనుగ్రహించినారు. తేది 13-10-2000వ తేదీన మహాసమాధి చెందుట ద్వారా ఈ దేహమును విడచి శ్రీ కృష్ణశేషు అవతార దేహము ద్వారానే కర్మచేయుటకేగినారు. శ్రీ గురుదేవులు సమాధి చెందుటకు ముందుగా ఈ విధముగా

చెప్పియున్నారు. నేను అవతార కార్యక్రమము నిమిత్తము వెళ్ళుచున్నాను. అక్కడ ఉండి కూడా ఇక్కడి మిమ్ముల నందరిని ప్రేమిస్తూ, రక్షిస్తూ, సేవ చేస్తూనే ఉంటాను. మిమ్ములనందరినీ నా సన్నిధికి పిలుస్తాను. నా పిలుపుకై నమ్మకముతో నిరీక్షిస్తూ ఉండండి. నా మరణమునకు ఎవ్వరూ బాధపడవద్దు. అని ముందుగా చెప్పియే వెళ్ళియున్నారు. మహాసమాధి చెందిన తరువాత కూడా మూడవ రోజగు 15-10-2000వ తేదీన శ్రీ గురుదేవులు శిష్యులకు ప్రత్యక్షముగా కనిపించి ఈ విధముగా చెప్పియున్నారు. "నా మరణమును గూర్చి బాధపడకండి. నేను మిమ్ములను వదిలి ఎక్కడికీ వెళ్ళిపోలేదు. మీకు తోడుగానే ఉన్నాను. మీరు నా సన్నిధి ఎక్కడ జరిపితే అక్కడ నేను ఉంటాను. సన్నిధిలో నేను మీతో మాట్లాడతాను. మీ ప్రశ్నలన్నింటికీ నేను సమాధానం చెబుతాను. సన్నిధిలో నేను మీతో సాంగత్యము చేస్తాను. కావున విచారించుట మానివేసి, నా సన్నిధి జరుపుకుంటూ, నా సన్నిధిలో నా సాంగత్యమును పొందండి" అని శ్రీ గురుదేవులు శిష్యులను ఓదార్చియున్నారు. శ్రీ గురుదేవులకు శ్రీ శేషు సత్సంగము యెడల గల ప్రత్యేక ప్రేమతో తన పిలుపుకు ప్రతి రూపముగ తన అవతార పరిధితో సాంగత్యము కలిగించే "కృష్ణశేషు సత్సంగము" అనే దైవీకార్యక్రమమును 5-8-2007 వ తేదీ నుండి ప్రసాదించియున్నారు. కృష్ణశేషు సత్సంగము ద్వారా అందరికీ శాంతిని, దైవీసాంగత్యమును అనుగ్రహించినారు.

శ్రీ గురుదేవులు తెలియచేసిన కొన్ని ప్రాథమిక సత్యవిషయాలను కొద్దిగా ఇక్కడ ప్రస్తావిస్తాను. ఆత్మవిమర్శ ద్వారా ఆత్మాభివృద్ధిని సాధించవచ్చునని శ్రీ గురుదేవులు ఈ విధముగా సత్యమును బోధించినారు."భగవంతుడు ప్రేమా స్వరూపుడు. సృష్టిలోని ప్రతి జీవిని భగవంతుడు సంపూర్ణముగా ప్రేమించుచునేయున్నారు. మాయవలన మనిషి భగవంతుని ప్రేమను గుర్తించుకోలేకపోవుటయేగాక, భగవంతుని వ్యతిరేకిస్తూ, ద్వేషించుచున్నాడు. కావుననే మనిషి ఎంత గొప్పగా భక్తి పద్ధతులను ఆచరించుచున్నను, ఎంత పెద్ద మతాధిపతి అయియున్నను గానీ భగవంతుడు ప్రత్యక్షముగా ఎదురయ్యేసరికి ఆయనను దూషించుటయో, అడవులకు పంపివేయుటయో, ఊరి నుండి తరిమివేయుటయో, శిలువ వేసేయుటయో చేయుచున్నాడు. మానవ దేహము సహజముగా పాపభూయిష్టమైనది. మానవుని నుండి అసూయ, ద్వేషము, అహంకారము, కామవికారములు, బాహ్యావిషయాసక్తి, దైవ దూషణ వంటి దుర్గుణములే ఉద్భవించుచుండును. కావున ప్రతివ్యక్తి తనలో దుర్గుణములే ఉన్నవని, తన దుర్గుణముల ఫలముగా తాను వంద పాళ్ళు బాధను అనుభవించవలసియున్నదని, భగవత్ప్రేమయే తన పాప ఫలములో 90 పాళ్ళు కొట్టి వేసి తనను రక్షించుచున్నదని గ్రహించుకోవాలి. తాను భగవత్ప్రేమను గుర్తించుకోకపోగా తిరిగి భగవంతుడినే ద్వేషిస్తూ వ్యతిరేకించుచున్నాననే సత్యమును ఆత్మవిమర్శ ద్వారా గ్రహించుకోవాలి.

 continue..

అలా గ్రహించుకున్న వ్యక్తిలో దైవీశక్తులు, దేవతాశక్తులు ప్రవేశించి ఆ దేహము ద్వారా సత్యఆత్మత, సత్యజ్ఞానము, సత్యకర్మలను ఆచరిస్తారు. అట్టి సత్యకర్మల ఫలితముగా ఆ దేహమునకు శాంతి, సుఖములు, ఆత్మాభివృద్ధి కలుగుతాయి" అని శ్రీ గురుదేవులు బోధించెడివారు.

అభిమాన ద్వేషములను గురించి శ్రీ గురుదేవులు ఈ విధముగా సత్యమును బోధించెడి వారు "మనిషి స్వయముగా పాపము చేయకపోయినాగానీ తాను అభిమానించే, ద్వేషించే వ్యక్తుల యొక్క సంస్కారభారము తనపైపడి ఆపాపభారమును తాను అనుభవించవలసి వస్తుంది. కావున మనిషి కుటుంబ సంబంధమైన, కులసంబంధమైన, మతసంబంధమైన, ప్రాంత సంబంధమైన బాహ్య అభిమాన ద్వేషములన్నిటిని విడనాడాలి. భగవంతుడిని, సత్పురుషులనే అభిమానించాలి. తనలోని తప్పులనే ఎక్కువగా ద్వేషించుకోవాలి. తద్వారా మనిషి అభిమాన ద్వేషముల ద్వారా ప్రాగుపడే సంస్కారముల నుండి తప్పించుకుని శాంతి సుఖములను పొందగలుగుతాడు". అని శ్రీగురుదేవులు బోధించియున్నారు.

మతములను గూర్చి శ్రీ గురుదేవులు ఈ విధముగా బోధించెడివారు. "సర్వాంతర్యామి, అనంతుడు, అవిభాజ్యుడు అగు భగవంతుడు ఒక్కడే అయియున్నారు. అన్ని మతములు ఏకైకుడైయున్న ఈ భగవంతుని గురించే వివిద రూపములతో వివిద నామములతో తెలియచేయుచున్నవి. ప్రతి మతస్థుడు తన మతములోని ఆచార వ్యవహారములను మూఢముగా ఆచరించుట కాకుండా వాటి వెనుక ఉన్న పరమార్థమును తెలుసుకుని ఆచరించాలి. ఆ మతమునకు మూలపురుషుడగు అవతారుడు లేదా సద్గురువు తెలియపరచిన సత్యతత్వమును గ్రహించి అయనను అభిమానిస్తూ అనుసరించాలి. ఏ వ్యక్తియైనా తన మతమును అనుసరిస్తూ వేరొక మతమును ద్వేషిస్తున్నాడంటే, తాను అనుసరిస్తున్న భగవంతుడిని తానే ద్వేషించుచున్నట్లే లెక్కలోనికి వస్తుంది. కావున అన్ని మతములు ఒకే సత్యదేవుని గురించే చెప్పినవనే సత్యమును గ్రహించి ప్రతి వ్యక్తి సర్వమతములను సమానముగా ఆదరించుటను అలవరచుకోవాలి". అని శ్రీ గురుదేవులు బోధించెడివారు.

మానవత్వము గూర్చి శ్రీ గురుదేవులు ఈ విధముగా బోధించినారు. "సర్వాంతర్యామియగు భగవంతుడు మనుష్యులందరిలోను అంతర్యామిగ ఉన్నారు. కావున బాహ్యహెచ్చు తగ్గులను బట్టి ఎవ్వరినీ తక్కువగా చూడరాదు, హేళన చేయరాదు. బాహ్య అభిమాన రహితముగా మానవత్వముతో సాటి మనుష్యులకు సేవ చేయుట కూడా భగవంతుని పూజయే అవుతుంది. కావున నిజమైన మానవత్వముతో మానవసేవ చేసే నాస్థికులు కూడా ఆస్థికులే అవుతారు. మనుష్యులందరిలో భగవంతుడే

 continue..

ఉన్నారనే సత్యమును ఎల్లప్పుడూ గుర్తించుకుంటూ మనుష్యులందరి యెడల గౌరవభావముతో వినయముగా మానవసేవ చేయవలెను". అని శ్రీ గురుదేవులు బోధించినారు.

విశ్రాంతి ప్రధాతయగు శ్రీ గురుదేవులు మానవజాతికంతటికీ ఈ విధముగా వాగ్దానము చేసియున్నారు. "గతకాలపు ప్రవక్తలందరు అంతిమకాలము ఏ విధముగా ఉంటుందని చెప్పియున్నారో ఆ విధమైన దుర్భరమైన కాలము ఇప్పుడు నడచుచున్నది. లోకమంతా దెయ్యపు ఆత్మలతో నిండిపోయియున్నది. మనుష్యులలో కూడా దెయ్యపు ఆత్మలు తిష్టవేసుకుని కూర్చొంటున్నాయి. మనుష్యులలోని సుఖ ఫలములన్నింటినీ దయ్యములు తినివేసి మనుష్యులను భరించలేనంత అశాంతిలోను, నరకాగ్నిలోను ముంచివేస్తున్నాయి. మనుష్యులు కీర్తి, కామము, కనకము వంటి స్వర్గ పరికరములు ఎంత ఎక్కువగా సంపాదించుకున్నను, సౌఖ్యపరికరములు, రక్షణ పరికరములు, వినోద పరికరములు అత్యధికముగా సమకూర్చుకున్నను గానీ అవి ఏవియు మనుష్యుని అణుమాత్రమైనా సుఖింపచేయుట లేదు. మనిషిలోని దెయ్యములు వాటి ఫలములన్నింటినీ తినివేయుటచే మనిషి నిద్రపట్టనంతగా అశాంతిలో కూలిపోయి విశ్రాంతి లేక తల్లడిల్లిపోవుచున్నాడు. ఇట్టి పరిస్థితిలో మనుష్యునికి కీర్తి, కామము, కనకము వంటి ఎన్ని స్వర్గ పరికరములు, ఎన్ని బాహ్యపరికరములు ప్రసాదించినను కానీ వాటివలన అతడికి ఎట్టి లాభము కలుగదు. కావున వాటన్నింటి కంటే విలువైనదియు, ప్రపంచములో మరెవ్వరు ఇవ్వలేనిదియు అగు విశ్రాంతినే నేను జనులకు ప్రసాదిస్తాను. ఎవ్వరైతే నన్ను గురువుగా, అవతారునిగా నమ్మి పూజిస్తారో, ఎవ్వరైతే నేను తెలియచేసిన సత్యమార్గమును అనుసరించుటకు ప్రయత్నిస్తారో, ఎవ్వరైతే నాసన్నిధి, నా సత్సంగములను ఆచరిస్తారో వారికి నేను విశ్రాంతిని ప్రసాదిస్తాను". అని శ్రీ గురుదేవులు వాగ్దానము చేసియున్నారు.

నిద్ర పట్టనంతటి అశాంతితో నరకమును అనుభవించుచున్న జనులపై జాలితో శ్రీ గురుదేవులు ఈ విధముగా వాగ్దానము చేసియున్నారు. "నిద్రపట్టని అశాంతితో ఉన్న వ్యక్తులు నన్ను నమ్మితే వారికి నేను సుఖనిద్రను ప్రసాదిస్తాను. ముందుగా మత రహితముగా శ్రీరాముడు, శ్రీ యేసుప్రభువు, శ్రీ మహమ్మద్ ముగ్గురూ ఒకే భగవంతుని యొక్క రూపములనే నమ్మకముతో వారి యెడల అభిమానమును కలిగియుండండి. సత్యమార్గము యొక్క ప్రాథమిక సూత్రములను తెలియచేసే బైబిలు గ్రంధము నందలి మత్తయి సువార్త యందలి 5,6,7 అధ్యాయములను పగటిపూట ఖచ్చితముగా చదవండి. రాత్రి పడుకునే ముందు నన్ను గురువుగా అవతారునిగా నమ్మి నా ఫొటోకు నమస్కరించుకోండి. నా ఫొటోను దగ్గరే ఉంచుకుని నిద్రకు ఉపక్రమించండి. అప్పుడు నేను మీకు సుఖనిద్రను ప్రసాదిస్తాను" అని శ్రీ గురుదేవులు వాగ్దానము చేసియున్నారు.

 continue..

విశ్రాంతి ప్రదాత, అభయప్రదాత అగు సద్గురు అవతార్ శ్రీ శేషుబాబు గురుదేవుల జీవిత విశేషములను అందరము తెలుసుకుని, ఆయన ఆచరించి చూపిన సత్యమార్గమును అనుసరించుట ద్వారా శ్రీ గురుదేవుల యొక్క ప్రేమ, రక్షణ, సేవలకు అందరము పాత్రులము కావాలని కోరుకొనుచున్నాము.

